# దేవుడు విసిరిన రాళ్ళు

సావిత్రి పురిటినొప్పులు పడుతోంది...

పురిటినొప్పులు వచ్చిన ప్రతిసారి ఈ ఆడజన్మ ఎత్తకూడదని తలుస్తూనే అయిదోసారి పురిటినొప్పులు పడుతోంది సావిత్రి.

పురిటినొప్పుల్ని మించిన బాధతో గుండెనొప్పులు పడుతోంది. ఈసారి కూడా ఆడపిల్లే పుడితే....?!! మనసులో వెయ్యిదేవుళ్ళకి మొక్కుకుంది. ఆ మెటర్నిటి వార్డు గోడలకి దేవుడి పటాలున్నాయేమోనని చూసింది. లేవు అన్నీ పిల్లల బొమ్మలే! బయట సుబ్బారావ్ వెయ్యిన్నర సార్లు దేవుడికి మొక్కుకున్నాడు, సావిత్రిని మించి. సుబ్బారావ్ సావిత్రిలకు నలుగురూ ఆడపిల్లలే....

పద్దెనిమిదేళ్ళు నిండిన మొదటి బిడ్డ సుమిత్రకు పెళ్ళిచేసారు. గోడకొట్టిన బంతిలా రెన్నెళ్ళకే సుమిత్ర తిరిగొచ్చింది. లాంఛనాలేవో తక్కువిచ్చారని అత్తగారు, భర్తగారు అగ్నికి ఆహుతి చెయ్యకుండా పంపినందుకు సుబ్బారావ్ సంతోషించాడు. సావిత్రి మొత్తుకుంది. ఆర్నెల్ల వాగ్యుద్ధం తర్వాత అల్లుడికి రెండువేల బేరిజు వేసి సంధికాలం కల్పించుకొని సుమిత్ర మళ్ళీ అత్తారింటికి వెళ్ళింది....

అనాడు వెళ్ళింది... ఇదిగో, ఈనాటి వరకూ రాలేదు...

సుబ్బారావ్, సావిత్రి గగ్గోలు పెడుతూ పోయేసరికి శవంకూడా కాలి పోయింది. సుబ్బారావ్ కళ్ళముందే మరో ఆడపిల్ల తండ్రి 'అతగాడికి' అడ్వాన్సు కట్నమిచ్చి పోయాడు. నిస్సహాయస్థితిలో వాళ్ళు తిరిగొచ్చారు. ఇంటికి వచ్చేసరికి మరో ముగ్గురు పిల్లలు ఏడుస్తూనే వున్నారు.

పదహారేళ్ళ సౌజన్య....

పన్నెండేళ్ళ స్వరూప....

తొమ్మిదేళ్ళ రంజని....

అక్కను తలుస్తూ ఏడుస్తున్నారు.... మర్చిపోయేంత వరకూ ఏడ్చారు.... కాని మర్చిపోలేకపోయారు.

మగపిల్లాడిమీద మమకారం చంపుకోలేక తిరిగి ఎనిమిదేళ్ళకి సావిత్రి గర్భం ధరించింది. అమ్మలక్కలు నల్లాపంపు దగ్గర ముక్కుమీద వేలేసుకొని ఇంకా తీయనేలేదు. తొమ్మిది నెలలు మోసి పురిటి నొప్పులు పడుతోంది.

సుబ్బారావ్ వరండాలో తిరుగుతున్నాడు. ఓవైపు అసహనం.... మరోవైపు ఆవేదన.... కొడుకు పుడితే తిరుపతి వెళ్ళాలనుకున్నాడు. ఈసారి యాదగిరిగుట్ట, వేములవాడ,... శ్రీశైలం....కొండగట్టు...

పనిగట్టుకొని తల్చుకుంటున్నాడు. లోపల సావిత్రి మూలుగుతోంది. కాన్పు కష్టమవుతుందేమో....?

సౌజన్య....

అంతలో సౌజన్య వచ్చింది.... సౌజన్య పసిమిఛాయ అందానికి పసుపురంగు లంగా మీద నీలిరంగు ఓణి వేసుకొంది!! అప్పటికే కళ వచ్చింది. నీరసంగావున్న పేషెంట్లు అతికష్టంమీద లేచి కూచున్నారు ఆమెను చూసి.

"నాన్నా... అమ్మకెలా వుంది. మీకు క్యారియర్ తెచ్చాను" అంది వస్తూనే. చనిపోయిన సుమిత్రా... సౌజన్య పోతపోసినట్టుగానే వుంటారు. సుబ్బారావ్‌కు ఆక్షణం పెద్ద బిడ్డ గుర్తుకొచ్చింది.... రంజని పుట్టినపుడు

సుమిత్ర కూడా ఇలాగే క్యారియర్ తెచ్చి అదే మాటంది.

కళ్ళలోని నీటి పొరని రెప్పలతోనే తొలగిస్తూ 'రంజని స్కూలుకు పోయిందామ్మా' అనడిగాడు.

"లేదు నాన్నా... మీకు క్యారియర్ ఇచ్చి వెళ్ళాక స్వరూపని, రంజనిని స్కూల్లో దింపి వస్తాను" అంది.

"త్వరగా వెళ్ళమ్మా... అమ్మ నొప్పులు పడుతోంది. ప్రసూతి కాగానే నేనొస్తాను. ఇంటిపద్దనే వుండు. ఎక్కడికి వెళ్లమాకు" హితబోధ చేసాడు సుబ్బారావ్. క్యారియర్ ఇచ్చి సౌజన్య పోయింది

పేషెంట్లు మళ్ళీ ముసుగు తన్ని పడుకున్నారు.

ఆస్పత్రి వరండాలో ఓ కుర్రడాక్టరు 'హలో' అన్నాడు, సౌజన్యను మూడురోజులుగా చూస్తున్నాడతడు.

"చెప్పండి... ఏం కావాలి?" అంది కళ్ల గుండ్రంగా త్రిప్పుతూ చలాకీగా.

"మీరు అందంగా వుంటారు" కుర్రడాక్టర్ సిగ్గుపడ్తు చెప్పాడు.

"వుంటే ఏమిటి? మీరు ప్రేమిస్తున్నారా"— వూహించని ప్రశ్న. డాక్టర్‌గారికి ఏం మాట్లాడాలో అర్థంగాక 'వూ' అన్నాడు.

"చూడండి. మార్కెట్లో మీ రేటెంత?" అర్థంగావడానికి అర నిమిషం పట్టింది. తమాయించుకొని "లక్ష" అన్నాడు.

'స్టెతస్కోపుకు బదులు ఓ లేబిల్ తగిలేసుకొని తిరగండి. నన్ను ప్రేమిస్తున్నాననుకుంటే ఇప్పుడే తాళి కట్టండి బరితెగించి అనటంలేదు.... చదువుకున్నా ఈ పనులు మానుకోని మీ మగాళ్లమీద జాలిపడి మాట్లాడుతున్నాను... ఏమంటారు?" అంతే! డాక్టర్ అదృశ్యమయ్యాడు. సౌజన్య నడుచుకుంటూ పోయింది.

స్వరూప....

స్వరూప ఏడవ తరగతి క్లాస్ రూంలోకి వెళ్ళేసరికి నోట్సు రాయని వాళ్లందర్నీ బయట ఎండలో నిలబెట్టింది టీచర్. వాళ్ల కళ్లలోంచి నీళ్లు... ముక్కులోంచి నీళ్లు... శరీరంలోంచి నీళ్లు.

స్వరూపకి ఫ్రెండ్స్‌ని చూడగానే నవ్వొచ్చింది.

"పతితలార, భ్రష్టులారా.... బాధాసర్పద్రష్టులార... దగాపడిన చెల్లెలారా ఏడవకండేడవకండి" అని కవిత చెప్పగానే టీచర్‌తో సహా అందరూ నవ్వేసారు.

చదువులోను, ఆటల్లోనూ చలాకీపిల్ల స్వరూప.

రంజని....

ముద్దుగా.... బొద్దుగా వుండే రంజని ఫ్రెండ్స్‌తో మొదటి పూట బడికాగానే బయటపడింది. రోడ్డుపైన కూడా అల్లరి.

రంజనిని ముద్దుపెట్టుకోవాలన్పించిన ఓ శాస్త్రి రోడ్డుమీదే "పాపా.... నీకు చాక్లెట్ ఇస్తా ఇలా రామ్మా...." అన్నాడు. అదే వాడు చేసిన పొరపాటు.

"చాక్లెట్ ఇస్తావా.... ఎందుకూ? కిడ్నాప్ చేస్తావా... అదేం మొహమయ్యా... కిడ్నాప్‌చేసే మొగంలా లేనేలేదు. ఇంతకీ కారు కూడా లేదే.... అయినా మా నాన్న గుమాస్తా గిరిగాడు. నీకేమిస్తాడు నాబొంద..." ఫ్రెండ్స్ అంతా కిలకిలా నవ్వగానే తుర్రుమంది. శాస్త్రి మూడురోజుల వరకు కోలుకోలేదు.

సరిగ్గా అప్పుడే హాస్పిటల్‌లో నర్సు తలుపుసందులోంచి తల బయటికి పెట్టింది. సుబ్బారావు పచార్లు ఆపి.... తక్కున ఆగిపోయాడు.

"మీ ఆవిడ ప్రసూతి అయింది. కవల పిల్లలు.... కాకపోతే ఇద్దరూ ఆడపిల్లలే" ఆకాశవాణి పలికినట్టు చెప్పి తలుపు మూసింది నర్సు.

సుబ్బారావ్ కాళ్లకింది భూమి కదలిపోయింది. పిరిమార్కోళ్లలా దేవుళ్లంతా కదిలిపోయారు.... డామిట్స్!!

తలపట్టుకొని ఏడ్చాడు. ఏడ్చి.... ఏడ్చి.... ఆస్పత్రిలోంచి పరుగెత్తటం మొదలెట్టాడు. ఏ దేవుళ్లనయితే ప్రార్థించాడో... ఆ దేవుళ్ళే రాళ్లు విసురుతున్నట్టు సుబ్బారావ్ పరుగెడుతున్నాడు.

పరుగు.... పరుగు... పరుగు...

ఒక బార్ ముందు ఆగిపోయాడు....

సావిత్రిమీద అసహ్యం పుట్టింది... ముత్యాల్లాంటి బిడ్డలమీద జాలి పుట్టింది. బ్రతుకుమీద రోత పుట్టింది. చేదు చుక్కలు గుండె మంటలపై పడి నెగడు రగుల్కొంది. అదుపుతప్పే వరకు తాగేసరికి రాత్రి ఎనిమిదయ్యింది.

అడుగులు తడబడుతుంటె తూలుతూ వాగుతూ ఇంటికొచ్చాడు. మూసివున్న తలుపుల్ని త్రోసేసరికి భళ్లున తెరుచుకున్నాయి...

ముగింపు దృశ్యం

ఆ దృశ్యం....

గుడ్డి వెలుతుర్లో బిడ్డల శవాలు గది మధ్యలో వూగులాడుతున్నాయి. మత్తు చర్మరంధ్రాల్లోంచి ఆవిరై పోతూ... చమటలు కక్కుతుంటే వాస్తవంలో పడ్డ సుబ్బారావ్....

ఏడ్వలేదు... ఏడ్పురాలేదు... పిచ్చివాడిలా చూస్తుండి పోయాడు. టేబిల్ మీద కాగితాలు రెపరెపమని చప్పుడు కావటంతో కాగితాలు తీసాడు. “నాన్నా...

నీ ముగ్గురి బిడ్డలకీ మృత్యువుతో పెళ్ళయింది. ఆశీర్వదించు నాన్నా.... బొడ్డుపేగుతో పుట్టింటికొచ్చాం... కొబ్బరితాడుతో అత్తారింటికి వెళ్తున్నాం... నాన్నా.... నీకిప్పుడు ముగ్గురు బిడ్డలు కాదు.... ఇద్దరే. ఆస్పత్రిలో ఈలోకం కుళ్లు తెలీక ఆడుకుంటున్నారు. అమ్మ వస్తే అత్తారింటికి దారివెదుక్కుంటూ పోయామని చెప్పు నాన్నా.... పసుపు ముడుల్లో చిక్కి పైట చిరిగినా మౌనాన్ని కప్పుకున్న అక్క మాకు ఆదర్శం!

అక్క తాళిని – ఉరి చేసుకోలేదా?

మంటపంలో దాని అగ్నిసమాధిని చూసుకోలేదా? ముస్తాబులో... బలిపశువును గుర్తుచేసుకోలేదా?? విషం మరిగే బావకి వెండిగ్లాసుతో పాలిచ్చిన అక్కని చేసిన చిత్రహింసలు నీకేం తెల్సు నాన్నా... ఏకాంత

ములో నాకు చెప్పేది.... దాని కటిభాగంలో సిగరెట్ కాల్చిన మచ్చలు.... బూటు తన్నులకు దాని నరాలు తెగిపోయాయి.

మాకూ—డా ఇప్పుడు పోస్టుమార్టం పేరుతో ఆ హింసలు తప్పవు కదా.

మగాడిది అనువంశిక తీర్పు నాన్నా...

మీరు, అమ్మ.... కొడుకు కోసం కలవరించారు... అనాదిగా తల్లిదండ్రులు కొడుకుల్నే ఎందుకు ప్రేమిస్తారు? కాళ్లమధ్య జారిపడ్డ వాడు.... కాలెత్తి తన్నడానికి సిద్ధపడినా... కొడుకునే ప్రేమిస్తారెందుకు.

కట్నంలేని పెళ్లిని ఆశీర్వదించు నాన్నా... మీ బంధాన్ని తెంచు కుంటూ మృత్యుసంబంధాన్ని మేమే చూసుకున్నాం...

ఆశీర్వదించు నాన్నా..."— నీ సౌజన్య, స్వరూప, రంజని.

సుబ్బారావ్ కుప్పకూలిపోయాడు.

ఆడపిల్లలన్న అక్కసుతో ప్రక్కలోని పసిహృదయాల్ని కసితో కర్కశంగా నలిపేద్దామనే ఆలోచన అక్కడ, ఆస్పత్రిలో సావిత్రికి స్ఫురి స్తోందని సుబ్బారావ్ కేం తెల్సు ?? ★

★✳★
✳★✳